రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి

మంత్రి కోమటిరెడ్డికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వినతి

ఉప్పల్: ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు రోడ్డు విస్తరణ పనులను ఏకకాలంలో మరింత వేగంగా చేపట్టాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం రాష్ట్ర రోడ్డు భవనాల, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. ఈ మేరకు ఉప్పల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఉప్పల్ నుంచి నారాపల్లి వరకు రోడ్డు అధ్వానంగా ఉందని, వాటిని కూడా చదును చేసి రోడ్డు వేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి సంబంధిత అధికారులకు వెంటనే ఫోన్ చేసి పనులు మరింత వేగంగా పూర్తిచేయాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ వైర్ల తొలగింపు

రామంతాపూర్ : హబ్సిగూడ డివిజన్ పరిధిలోని వెంకటరెడ్డినగర్, రాంరెడ్డినగర్, వాసవీనగర్, నౌరంగూడ, శ్రీనివాసపురం, మధురానగర్ తదితర ప్రాంతాల్లో కిందకి వేలాడుతూ.. చెట్ల మధ్యలో ఉన్న విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉందని, వెంటనే వాటిని సరిచేసి చెట్ల కొమ్మలను తొలగించాలని ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపరం పటేల్ విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం విద్యుత్ సిబ్బంది వేలాడుతున్న తీగలను సరిచేసి చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ.. వినాయక చవితి నవరాత్రుల ఉత్సవాలకు మండపాల వద్ద ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పీహెచ్‌సీలో అధునాతన దంత వైద్య సేవలు

అల్వాల్: మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంటల్ సర్జన్ డాక్టర్ పోటు వినోద్ ఆధ్వర్యంలో ఓ మహిళకు అరుదైన, క్లిష్టమైన చికిత్స చేశారు. డాక్టర్ వినోద్ మాట్లాడుతూ.. మహిళ 14 దంతాలు పూర్తిగా కుళ్లిపోయాయని, రూట్ కెనాల్ చేసి మొత్తం 28 దంతాలను మెటల్ సెరామిక్ ఫిక్స్‌డ్ క్రౌన్లతో ప్రతిస్థాపించామని, దీంతో ఆమెకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. ఈ మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి డాక్టర్ ఉమాగౌరి చికిత్స చేసిన డాక్టర్ వినోద్‌ను ఈ సందర్భంగా అభినందించారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

కుషాయిగూడ: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు అంతర్గత రోడ్లతో పాటు బీటీ రోడ్లు కూడా పూర్తిగా ధ్వంసమై వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈసీఐఎల్ నాగారం రోడ్డుతో పాటుగా డీమార్ట్‌కు వెళ్లే మార్గంలో బీటీరోడ్లు ఛిద్రమై గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. గ్రేటర్ పరిధిలోని రోడ్ల దుస్థితి గ్రామీణ ప్రాంతాల కంటే అధ్వానంగా ఉందంటున్నారు. గుంతలమయమైన రోడ్లపై అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేపట్టి వాహనదారులకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో స్వర్ణకారుడి మృతి !

'మార్వాడీ గోబ్యాక్' ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన విశ్వకర్మలు

మేడిపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఓ స్వర్ణకారుడు మృతి చెందిన ఘటన మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో చోటు చేసుకుంది. స్థానికులు,బంధువులు తెలిపిన వివరాల ప్రకారం బుద్ధానగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఈశ్వరోజు రాజుచారి(28)తన తల్లి,సోదరుడితో కలిసి కులవృత్తి చేసుకుంటూ.. స్థానికంగా నివాసం ఉంటున్నాడు. కాగా కొన్నేళ్ల నుంచి సరిగ్గా పనులు లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులు తోడవడంతో ఇంటి అద్దె చెల్లించలేని పరిస్థితి రావడంతో తీవ్ర మనోవేదనకు గురై అనారోగ్యం పాలై మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ ఘటనతో బోడుప్పల్, పీర్జాదిగూడ జంటనగరాల విశ్వకర్మ ప్రతినిధులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని 'మార్వాడీ గోబ్యాక్' ఫ్లెక్సీలతో నినాదాలు చేశారు.

రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి జయంత్యుత్సవాలు

మల్లాపూర్: రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి 156వ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. మల్లాపూర్ రెడ్డి సంఘం అధ్యక్షులు కాసం రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి దోమ శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దయాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు పద్మారెడ్డి, కోశాధికారి ముత్యంరెడ్డి, మల్లారెడ్డి, కృష్ణారెడ్డి, రాజురెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, యాకుబ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మండపం ఏర్పాటులో అప్రమత్తం.. !

గణపతిని తీసుకొచ్చేటప్పుడు జర జాగ్రత్త | **ప్రతి మండపం వద్ద విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి** | **స్పష్టం చేసిన మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి**



పూజకు సిద్ధమైన మట్టి గణపతులు

ఉప్పల్ : వినాయక పండుగ సమీపిస్తున్న సందర్భంగా గతంలో కంటే ఈసారి మరిన్ని బలగాలతో భద్రతను పటిష్టం చేస్తున్నట్లు మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి తెలిపారు. మండపాల వద్ద డీజేకు అనుమతి లేదని, పటిష్టమైన ఎలక్ట్రిసిటీ ఏర్పాట్లు చేసుకోవాలని.. ఎక్కడా అలసత్వం వహించకూడదని సూచించారు. మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని ప్రతి వినాయక మండపాల వద్ద నలుమూలల కనబడేలా విధిగా నిర్వాహకులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

పోలీసులకు సహకరించాలి

ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఏసీపీ పేర్కొన్నారు. సంఘ విద్రోహ శక్తులపై ఓ కన్ను వేసి ఉంచాలని, గుర్తు తెలయని వారు మండపాల వద్దకు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. భద్రత, బాధ్యత పోలీసులపైనే కాకుండా సివిలియన్స్‌పై కూడా ఉందన్నారు.

విద్యుత్ కనెక్షన్లపై..

మండపాలకు స్వతహాగా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చుకోవద్దని నిపుణులతో మాత్రమే పనులు చేయించుకోవాలని సూచించారు. పార్కింగ్ కోసం తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.

ప్రతి మండపానికి జియో ట్యాగింగ్

భక్తుల భద్రత దృష్ట్యా ప్రతి మండపానికి జియో ట్యాగింగ్ అమర్చుతున్నట్లు తెలిపారు. వినాయకుడిని మండపంలో ప్రతిష్ఠాపన దగ్గర నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం తదితర అంశాలతో పాటు ఊరేగింపు, నిమజ్జనం వరకు పోలీస్ నిఘాలో ఉంటుందని స్పష్టం చేశారు.

నాణ్యమైన వైరింగ్‌తో విద్యుత్ పరికరాలను అమర్చుకోవాలని, లేదంటే విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని సూచించారు. మండపంలో కనీసం రెండు ఫైర్ సిలిండర్లతో పాటు బకెట్లు, ఇసుక నీరు తప్పకుండా అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

మండపం వద్ద నైట్ వలంటీర్లు తప్పనిసరి

ప్రతి మండపం వద్ద విగ్రహాల వద్ద అఖండ దీపాలు వెలుగుతుంటాయి. కాబట్టి ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకుకోకుండా, లడ్డూలు దొంగతనం కాకుండా ఉండేందుకు ప్రతి మండపం వద్ద వలంటీర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు.

డీజేలకు అనుమతి లేదు

వినాయక మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని నిర్వాహకులు గమనించాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించి డీజేలను ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

నిమజ్జన వివరాలు విధిగా వెల్లడించాలి

ప్రతి మండప నిర్వాహకులు తమ వినాయకుడిని ఎక్కడ నిమజ్జనం చేస్తారో.. పూర్తి వివరాలను గస్తీ పోలీసులకు అందజేయాలి. గతేడాది దాదాపుగా 3000లకు పైగా విగ్రహాలను ఏర్పాటు చేశారని, ఈసారి విగ్రహాల ఏర్పాటు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

మట్టి గణపతులనే పూజించండి



సాధ్యమైనంత వరకు పర్యావరణ హితమైన మట్టి గణపతులనే పూజించాలి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయకుల వల్ల పర్యావరణం దెబ్బతినే అవకాశం ఉంది. వినాయక ఉత్సవ సమితి ప్రతినిధులు కూడా వాటినే ప్రోత్సహించాలి.

– ఏసీపీ చక్రపాణి

రసాయన రంగుల విగ్రహాలు హానికరం



రసాయన రంగులతో తయారు చేసే విగ్రహాలు జల జీవులకే కాకుండా వివిధ ప్రాణుల మనుగడకు హాని కలుగుతుంది. దాన్ని అరికట్టడానికి ప్రతి ఏటా 5 వేల మట్టి విగ్రహాలు, జ్యూట్‌బ్యాగ్‌లతో కలిపి గత పదేళ్లుగా ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.

– ఆకుల మహేందర్

సచివాలయానికి తరలిన బీజేపీ నేతల అరెస్ట్



అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఉప్పల్ బీజేపీ నేతలు

గౌతంనగర్: గ్రేటర్ హైదరాబాద్ ప్రజా సమస్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు పిలుపు మేరకు సచివాలయం వద్ద చేపట్టిన శాంతియుత నిరసన కార్యక్రమానికి గౌతంనగర్ డివిజన్ నుంచి తరలివెళ్లారు. అనంతరం బీజేపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. బీజేపీ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌ముదిరాజ్, జిల్లా కోశాధికారి బాలచంద్రగౌడ్, గణేష్, శ్రీనివాస్‌ముదిరాజ్, శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్: సెక్రటేరియట్ ముట్టడిలో భాగంగా ఉప్పల్‌కు చెందిన పలువురు బీజేపీ నేతలను ఉప్పల్ పోలీసులు ముందుస్తుగా అరెస్ట్ చేసి అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు పిలుపు మేరకు నిర్వహించిన సెక్రటేరియట్ ముట్టడిలో భాగంగా శుక్రవారం ఉదయం నుంచే బీజేపీ నేతలను ఒక్కొక్కరిగా హౌజ్ అరెస్ట్ చేశారు. డివిజన్ అధ్యక్షులు మారినేని ఫణీందర్, బీజేపీ నేతలను లిబర్టీ అంబేడ్కర్ విగ్రహం వద్ద అడ్డుకుని అరెస్టు చేసి అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కుషాయిగూడ: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం తలపెట్టిన సెక్రటేరియట్ ముట్టడి సందర్భంగాచర్లపల్లి డివిజన్‌కు చెందిన బీజేపీ నేతలను పోలీసులు అరెస్టు చేసి నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ.. ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపితే అక్రమంగా అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో ప్రజాగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. నాదం, నర్సింగరావు, లక్ష్మణ్‌గౌడ్, అశోక్, సహదేవ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

గణేష్ ఉత్సవ సమితి కో-కన్వీనర్‌గా గోపాల్‌గౌడ్

మల్లాపూర్: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నాచారంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ అసెంబ్లీ కో-కన్వీనర్‌గా బీజేపీ మేడ్చల్-మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి గోపాల్‌గౌడ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి మల్కాజిగిరి పార్లమెంట్ కో-కన్వీనర్ రెవెల్లి రాజు, ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ చల్లా ప్రభాకర్‌లు ఆయను సత్కరించారు.

నేటి నుంచి అరోరాలో హెల్త్ సైన్స్ కోర్సులు

ఉప్పల్: అరోర విశ్వవిద్యాలయంలో ఉద్యోగ ఆధారిత హెల్త్ సైన్స్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి అవగాహన కార్యక్రమాలు ప్రారంభవుతున్నట్లు పేర్కొన్నారు. ఆధునిక ప్రోగ్రామ్స్, దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతమైన కెరీర్ ఉన్న పారామెడికల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. బీపీటీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, ఫోరెన్సిక్ సైన్స్, అనస్థీషియా అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ, రేడియాలజీ లాంటి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్న కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9032233908.

బాలాజీ వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

అల్వాల్: టెంపుల్ అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాస శుక్రవారం సందర్భంగా సుదర్శనహోమం నిర్వహించారు. అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సతీమణి మర్రి మమత హాజరై ప్రత్యేక పూజలు చేశారు. రమేష్, బీఆర్ఎస్ నేతలు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే నిరాధార ఆరోపణలు



మాట్లాడుతున్న మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: తనను రాజకీయంగా ఎదుర్కోలేకే తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ గోకుల్‌నగర్‌లోని ప్లాట్ల యజమానులను వేధింపులకు గురిచేస్తున్నట్లు చేసిన ఆరోపణల నేపథ్యంతో శుక్రవారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 1968లో గోకుల్‌నగర్ కాలనీలో లే అవుట్ చేసిన వారి వారసులు ప్లాట్ నెంబర్ 300ను తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, గత 6 నెలల క్రితం వారు నాచారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. వారిపై కేసు నమోదైందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మల్లాపూర్ డివిజన్‌ను గత పదేళ్లుగా ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తుంటే వారు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. 24 గంటలో మీడియా సమక్షంలో క్షమాపణలు చేప్పాలని లేకుంటే పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు. హమాలీ శ్రీనివాస్, కుంటి కృష్ణ, వాసుగౌడ్, తీగుళ్ల శ్రీనివాస్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, రాపోలు సతీష్, చంద్రశేఖర్, శ్యాంసుందర్, కృష్ణయాదవ్, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి : అభివృద్ధి, నిర్మాణపనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ సూచించారు. సంతోషిమానగర్ పీబీ కాలనీల్లో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. గత పాలకులు కేవలం ఓట్ల కోసం ఈ ప్రాంతాలకు వచ్చేవారని, కాలనీవాసుల అభ్యర్థన మేరకు సీసీరోడ్డుకు నిధులు మంజూరు చేయించి, నిర్మాణ పనులను చేపట్టామన్నారు. రోడ్ల నిర్మాణానికి నిధుల కేటాయించిన కార్పొరేటర్‌కు ఆయా కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నేతలు వెంకటేష్, శివ, కాలనీవాసులు వెంకటరమణ, ఝాన్సీ, రేఖ, శిరీషా తదితరులున్నారు.

ఎంటమాలజీ ఆధ్వర్యంలో 'ఫ్రైడే డ్రై డే'



మోడల్ మిషన్ హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అల్వాల్: సర్కిల్ ఎంటమాలజీ ఆధ్వర్యంలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో భాగంగా అల్వాల్ డివిజన్ మోడల్ మిషన్ హైస్కూల్‌లో 'నేను సైతం' అనే నినాదంతో దోమల నియంత్రణ, వాటి ద్వారా వచ్చే వ్యాధుల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల పరిసరాలల్లో నిల్వ ఉన్న నీటి పరిసరాలను గుర్తించి తొలగించడం ద్వారా దోమ లార్వా చనిపోయి వాటి ద్వారా వచ్చే వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ అనిల్‌కుమార్, సూపర్‌వైజర్లు, రాజు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



రామాంజనేయనగర్‌లో పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని రామాంజనేయనగర్‌లో రూ.16 లక్షలతో నిర్మించే ఆర్‌సీసీ పైపులైన్ పనులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం కార్పొరేటర్ మేకల సునీతారామయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. దశాబ్దకాలంగా అన్నపూర్ణ సొసైటీ, శివగంగా, రామాంజనేయనగర్ తదితర ప్రాంతాల్లో మురుగుతో వర్షాకాలంలో వరదనీరు పొంగిపొర్లుతూ కాలనీలో ప్రవహిస్తుండేదని, ఈ సమస్య పరిష్కారానికి ఆర్‌సీసీ పైపులైన్ నిర్మాణ పనులను చేపట్టామన్నారు. ఏఈ దివ్యజ్యోతి, నాయకులు మేకల రాముయాదవ్, బైరు అనిల్, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం



మొక్కలు పంపిణీ చేస్తున్న సుమన్‌నాయక్

బోడుప్పల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుదామని 21వ డివిజన్ మాజీ కార్పొరేటర్ భూక్యా సుమన్‌నాయక్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం ఆయన కాలనీవాసులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి ఆవరణలో పెట్టుకునేందుకు పండ్లు, పూల మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. మనం నాటే ప్రతి మొక్కను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వార్డు ఆఫీసర్ సుమలత డివిజన్ అధ్యక్షులు గొండయ్య, సునీల్, అఖిల్, కాలనీవాసులు పాల్గొన్నారు.

నిమిషాంబదేవి ఆలయంలో సుమంగళి పూజలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవి ఆలయంలో శ్రావణమాసం ఐదో శుక్రవారం సందర్భంగా సుమంగళి విశేష పూజలు నిర్వహించారు. 60 ఏళ్లు పైబడిన 200 మంది పెద్ద ముత్తయిదువు మహిళలకు సుహాసిని పూజ వాయినాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ మాట్లాడుతూ.. శ్రావణ మాసంలో నిష్టతో పూజలు నిర్వహిస్తే కోరిన కోరికలు నెరవేరతాయన్నారు. ఆలయ చైర్మన్ వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు అశోక్‌కుమార్, శ్రీనివాస్, కోశాధికారి రమేష్, నకాష్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజిత తదితరులు

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మాల బస్తీలో రూ.92 లక్షలతో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను శుక్రవారం స్థానికులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రతి కాలనీ, బస్తీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. దాదాపుగా అన్ని కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, స్థానికులు లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

'టీబీ ముక్త్ తెలంగాణ'కు కృషి చేయాలి

350 మంది పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



కాప్రా సర్కిల్ కార్యాలయంలో వైద్య శిబిరం

కాప్రా: టీబీ ముక్త్ తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి పిలుపునిచ్చారు. టీబీ రహిత తెలంగాణలో భాగంగా 100 రోజుల ప్రణాళికతో జిల్లాలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దీనిలో భాగంగా శుక్రవారం కాప్రా సర్కిల్ కార్యాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 350 మంది పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ.. టీబీ వ్యాధి పూర్తిస్థాయి నివారణకు ప్రభుత్వం ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యాధి లక్షణాలు..

టీబీ లక్షణాలు ఆకలి మందగించడం, బరువు తగ్గడం, చెమటలు పట్టడం, గొంతుభాగంలో గడ్డలు ఏర్పడటం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, అలాంటి లక్షణాలుంటే తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలని చెప్పారు.

వ్యాధి గ్రస్తులకు ప్రతినెల రూ.1000

ప్రస్తుతం నిర్వహిస్తున్న వైద్య శిబిరాల ద్వారా పరీక్షలు నిర్వహించి ఎవరికైనా టీబీ లక్షణాలున్నట్లు బయటపడితే వారికి ఉచితంగా మందులతో పాటు పౌష్టికాహారం కోసం ప్రతినెల రూ. 1000 అందిస్తామన్నారు. గతంలో వ్యాధి బారిన పడిన వారితో పాటు వారి కుటుంబసభ్యులకు కూడా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, టీబీ వ్యాధిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కుషాయిగూడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమాదేవి, సర్కిల్ ఏఎంహెచ్‌ఓ మధుసూదన్‌రావు, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, డాక్టర్ విజయ, డాక్టర్ రాణి, డాక్టర్ ప్రసన్న, టీబీహెచ్‌వీ రామ్‌సింగ్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



ఆకలి మందగించడం, గొంతుభాగంలో ఇబ్బందిగా ఉండటం, తదితర లక్షణాలుంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలి. సరైన సమయంలో పరీక్షలు చేయించుకోవడం ద్వారా త్వరగా చికిత్స చేయించుకోవచ్చు.

– డాక్టర్ శ్రీదేవి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్